క్లుప్తంగా

వైభవంగా అక్షయ తృతీయ వేడుకలు



మహాలక్ష్మీదేవి పూజల్లో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని కోటా వీధిలో వెలసిన శ్రీ రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం అక్షయ తృతీయను పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకాలు, సుగంధ పరిమళ అభిషేకాల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రసాద్‌కు బెస్ట్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డు



ప్రసాద్‌ను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ప్రముఖ కూరగాయల వ్యాపారి లక్కబోయిన ప్రసాద్‌కు రోటరీ క్లబ్ బెస్ట్ సర్వీస్ ఎక్సలెన్స్ అవార్డును ఆదివారం స్థానిక కార్యాలయంలో పీడీజీ రామలింగారెడ్డి అందజేశారు. రోటరీ సభ్యులు మాట్లాడుతూ 20 సంవత్సరాల నుంచి నంద్యాల చుట్టుపక్కల అన్నదాన కార్యక్రమాలు, మహాశివరాత్రికి మహానంది, శ్రీకాళహస్తీశ్వర దేవస్థానాలకు సుమారు 25 టన్నుల కూరగాయలను ప్రతి సంవత్సరం అందజేస్తారని, అందుకు గాను ఈ అవార్డు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు అనిల్‌కుమార్, మోహన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, నెరవాటి సత్యనారాయణ, నాగరాజు, భార్గవవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఉపాధ్యాయ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలని, సంపాదిత సెలవుల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకొని సంవత్సరం దాటిపోయిందని, ఈ మొత్తాన్ని త్వరలో మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కరరెడ్డి, విజయరావు, సుమయూన్, జగదీష్, చెన్నుడు, నరసింహులు, శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం రోజుల పాటు కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కిందనున్న గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి కడప జిల్లా ఒంటిమిట్ట మండలం మాధవరం గ్రామానికి చెందిన నామాల వెంకట సుబ్బయ్య, ఈశ్వరమ్మ దంపతులు రూ.25 వేలు విరాళం ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆలయ మాజీ చైర్మన్ పీఆర్ వెంకటేశ్వర రెడ్డికి దాతలు నగదు అందజేశారు. ప్రత్యేక పూజల అనంతరం దాతను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా బసవ జయంతి



బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైర్మల్ వీధిలో బసవేశ్వర దేవస్థానంలో ఆదివారం వీరశైవ సంక్షేమ సమాజం ఆధ్వర్యంలో బసవ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేపట్టి, పట్టణంలో గ్రామోత్సవం జరిపించారు. అనంతరం చిన్నారులకు లింగాష్టక, బిల్వాష్టక పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇటీవల రాష్ట్ర వీరశైవగామ అధికారిగా ఎన్నికైన నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతిని వీరశైవ సంక్షేమ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణ అధ్యక్షుడు కర్నూలు నాగరాజు మాట్లాడుతూ సమాజంలో కులాలను, మతాలను రూపుమాపేందుకు తొలి అడుగు వేసిన మొట్టమొదటి సంఘ సంస్కర్త బసవేశ్వరుడు అని, శివతత్వాన్ని బోధించిన మహానీయుడని కొనియాడారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రైల్వే గేటు పడితే ఇక్కట్లే..

మూలసాగరం మీదుగా వెళ్లడానికి పట్టణవాసులు, ఆటోవాలాలు, ఇతర వాహనదారులు జంకుతారు. కారణం.. నిత్యం రైలు గేటు పడిన ప్రతి సారీ వందల వాహనాలు నిలిచి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుండటం. రోజుకు పలుమార్లు గంటల తరబడి వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి నరకం చూస్తున్నారు. ఏళ్లుగా సమస్య వేధిస్తోంది. సమస్య పరిష్కారానికి వంతెన నిర్మించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. ఇటీవల రైళ్ల సంఖ్య పెరగడంతో సమస్య మరింత తీవ్రమైంది.

- రైలు కూతతో మూలసాగరం గేటు వద్ద నిలిచిపోతున్న వాహనాలు
- గంటల తరబడి స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఏళ్లుగా కొనసాగుతున్న సమస్య
- వంతెన ఏర్పాటును పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అత్యవసరమైనా..ఎదురు చూపులే



మూలసాగరం గేటు వద్ద రైలు వస్తున్న దృశ్యం



నూనెపల్లె ఫ్లై ఓవర్ కింద పట్టాలపై నడుస్తూ వస్తున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): నంద్యాల రైల్వేస్టేషన్ సమీపంలో మూలసాగరం గేటు ఉండటంతో రైళ్ల రాకపోకలతో పాటు ఇంజిన్ల సెంటింగ్‌లు అంటూ పలు మార్లు గేట్లు వేస్తుండటంతో వాహనాలు గంటల తరబడి నిలిచి పోతున్నాయి. డోన్ నుంచి వస్తున్న రైలు పాణ్యం దాటి కుందూ వంతెన సమీపానికి రాకమునుపే గేటు వేయడం, స్టేషన్‌కు చేరేంత వరకు గేటు తీయకపోవడం, గుంటూరు నుంచి వచ్చే రైళ్లు డోన్ వైపు బయల్దేరే ముందుగానే గేట్లు వేయడం, సిగ్నల్ వచ్చేంత వరకు గేట్లు తీయడం లేదు. గేట్లు వేసిన ప్రతిసారి వందల సంఖ్యలో వాహనాలు నిలిచి పోతున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉంటుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. బొమ్మలసత్రం వద్ద టీ ఆకారం వంతెన ఏర్పాటు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, లారీలు, ఆటోలు, టూవీలర్స్ వాహనాలు అన్నీ మూలసాగరం రైల్వే గేటు మీదుగా పట్టణంలోకి వస్తూ పోతుండటంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరమైంది. ఇలా ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు వంతెన ఏర్పాటును పట్టించుకోకపోవడం దారుణమని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు.

కలగా మారిన అండర్ గ్రౌండ్ వంతెన..

నూనెపల్లె ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలను దాటుకుంటూ వెళ్లేందుకు ప్రజలు, మూగజీవాలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి సమీపంలో రైల్వే గేట్ లేకపోవడంతో రైలు వస్తున్న సమయం తెలియక పశువులు ప్రమాదాలకు గురైన సందర్భాలు అనేకం. ఇక వృద్ధులు పట్టాలు దాటలేక కిందపడిన సంఘటనలు కోకొల్లలు. కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ, గిద్దలూరు తదితర ప్రాంతాల ప్రజలు పట్టాలు దాటి పట్టణంలోకి రావాల్సి ఉంటుంది. ఇలా నిత్యం వేలాది మంది ప్రజలు, మేత కోసం వందలాది పశువులు పట్టాలు దాటుకుంటూ వెళ్తుంటాయి. త్వరలో ఎలక్ట్రిక్ రైళ్లు, ట్రాక్ డబ్లింగ్ అవుతుండటంతో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంతెన ఎక్కడ ఏర్పాటు అవుతుందో..

నిత్యం రద్దీగా ఉండే మూలసాగరం రైల్వే గేటు సమీపంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలు మార్లు స్థానికులు రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందజేశారు. నూనెపల్లె ఫ్లై ఓవర్ వంతెన కింద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలంటూ స్థానికులు కోరుతున్నారు. అలాగే పొన్నాపురం వద్ద ఫ్లై ఓవర్ వంతెన ఏర్పాటు చేయాలంటూ ఆ ప్రాంత వాసులు కోరుతున్నా రైల్వే అధికారులు మాత్రం ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం.

మూలసాగరం వద్ద వంతెన ఏర్పాటు చేయాలి



రైల్వే గేటు వేసిన ప్రతి సారి వందలాది వాహనాలు గంటల తరబడి నిలిచిపోతున్నాయి. అత్యవసరాలకు కూడా గేట్లు ఎత్తే అవకాశం లేదు. నిత్యం రద్దీగా ఉండే మూలసాగరం రైల్వే గేటు సమీపంలో ఫ్లై ఓవర్ ఏర్పాటు చేయాలని ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధులను కోరాం. త్వరలో అనుమతులు వస్తాయని భావిస్తున్నాం. – దాల్‌మిల్ అమీర్, నంద్యాల

ఆటోలను మరో మార్గంలో తీసుకెళ్తున్నాం




మూలసాగరం వైపు ఆటోను బాడుగకు వెళ్లాలంటే ఆందోళనగా ఉంటుంది. గంటల తరబడి రైల్వే గేటు వద్ద నిరీక్షించాలంటే సమయం వృథా అవుతుంది. గేటు వేసిన ప్రతిసారి మరో మార్గంలో బొమ్మలసత్రం వైపు వెళ్తున్నాం. ఫ్లై ఓవర్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తొలగిపోతాయి. అధికారులు స్పందించాలి.

– మిడుతూరి రాజు, ఆటోడ్రైవర్, నంద్యాల

రేపు రుద్రమూర్తికి విశేష పూజలు

శ్రీశైలం : లోక కల్యాణార్థం శ్రీశైల ఆలయ ఈశాన్య భాగంలోనున్న రుద్రపార్క్‌లోని రుద్రమూర్తికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజాధికాలు జరిపించనున్నారు. రుద్ర విగ్రహాన్ని గతంలో శంకర జయంతి రోజున నెలకొల్పారు. ఈ కారణంగాఏటా శంకర జయంతి రోజున రుద్రమూర్తికి ప్రత్యేక పూజలు చేస్తారు. కార్యక్రమంలో రుద్రమూర్తికి ఆపాదమస్తకంగా విశేష అభిషేకాలు, పూజా కార్యక్రమాలు జరిపిస్తారు. కాగా.. రుద్రుడి చల్లని చూపులు కృష్ణానదిపై ప్రసరించడం వల్ల నదిలో నీరు సమృద్ధిగా ఉండి, పంటలు బాగా పండుతాయని, అలాగే శ్రీశైలం ఆనకట్ట ఎల్లప్పుడూ పరిరక్షింపబడుతుందని పలువురు ఆధ్యాత్మికవేత్తలు సూచనతో ఆలయ ఈశాన్య భాగంలో కృష్ణానదికి అభిముఖంగా రుద్రుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.



కొంగల ఆహార అన్వేషణ

రుద్రవరం: కొంగల ఆహార అన్వేషణ చూడ ముచ్చట గొల్పుతోంది. గుంపులుగా పొలాల్లో వాలడం, అటు వైపు ఏదైన శబ్దం అయితే గాలిలోకి ఎగరడం, తిరిగి వాలడం చూపరులను ఆకట్టుకుంటోంది. మండలంలోని పెద్దకంబలూరు–డీ.కొట్టాల మధ్య వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో చైన్ మిషన్ల ద్వారా రైతులు కోతలు కోయిస్తున్నారు. ఓ వైపు మిషన్ కోతలు కోస్తుండగానే మరో వైపు మిషన్ జాడల్లో కొంగలు వాలుతున్నాయి. మిషన్ వెళ్లిన జాడల్లో చిన్న చిన్న పురుగులు బయటకు వస్తే వాటిని భుజించేందుకు పోటీపడుతున్నాయి.

ఐక్యతతోనే హక్కుల సాధన

నంద్యాల(అర్బన్): రజకుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని ఏపీ రజక ఎస్సీ సాధన చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. స్థానిక రెవెన్యూ నిశాంత్ భవన్‌లో రాష్ట్రస్థాయి రజక కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన శ్రీనివాసులు మాట్లాడుతూ కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న రజకులపై పలు జిల్లాల్లో దాడులు, వేధింపులు, బహిష్కరణలు జరిగాయని, వీటన్నింటిపై ఐకమత్యంగా పోరాడాలన్నారు. వృత్తిని చేసుకొని జీవిస్తున్న 50 ఏళ్లు నిండిన రజకులకు రూ.5వేల పింఛన్ ప్రభుత్వం మంజూరు చేయాలని, గ్రామాల్లో దోభీ ఘాట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జూటూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా అవుకు వెంకటేశ్వర్లు, మురళీమోహన్, ప్రధాన కార్యదర్శిగా చిన్న తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వ్యాధులతో చికిత్స పొందిన పలువురికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఆదివారం తన స్వగృహంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా 12 మందికి రూ.8.28 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం ఆర్‌ఎఫ్ కింద రూ.4.85 కోట్లు పంపిణీ చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగాలకు సీఎం ఆర్‌ఎఫ్ కింద నిధులు మంజూరు చేస్తూ పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని కొనియాడారు.

ఘనంగా మరియమ్మ వర్తమాన దినోత్సవం

ఆళ్లగడ్డ: కన్య మరియమ్మ వర్తమాన దినోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం చాగలమర్రి సీఎస్‌ఐ ప్రార్థన మందిరంలో ఫాదర్ రెవరెండ్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కన్య మరియ గర్భంలో పుడతానని ఏసుక్రీస్తు గాబ్రియల్ దేవదూత ద్వారా తెలియజేసిన రోజును పురస్కరించుకొని వేడుకలు నిర్వహించామని ఆయన తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

వీధుల్లో కొత్త రోడ్లు..



మహదేవపురంలో వేసిన సిమెంట్ రోడ్డు



గంగవరంలో వేసిన సిమెంట్ రోడ్డు



జీనేపల్లెలో వేసిన సిమెంట్ రోడ్డు

శిరివెళ్ల: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపుతోంది. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా నున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం మార్గం లభిస్తోంది. నిన్నటి వరకు మట్టి రోడ్లతో వీధుల్లో నడవడానికి ఇబ్బందులు పడిన గ్రామస్తులకు ప్రస్తుతం నూతన సీసీ రోడ్లు వేయడంతో అవస్థలు తప్పాయి. ఇంటి ముందే మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నా ముక్కు మూసుకొని పనులు చేసుకున్నారు. కానీ నేడు.. కాలువల ద్వారా వృథా నీరు గ్రామం దాటి పోతుండటంతో పరిసరాలు శుభ్రంగా మారాయి. మండలంలో 16 గ్రామ సచివాలయాలుండగా.. 5 గ్రామ సచివాలయల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. ఆయా గ్రామాల్లో ప్రజలు అధిక శాతం సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డిని కోరారు. సమస్య తీవ్రతను గమనించి, ప్రాధాన్య క్రమం ఆధారంగా సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. మహదేవపురంలో రూ. 20 లక్షలతో డ్రైనేజీ కం సిమెంట్ రోడ్డు నిర్మాణం, గంగవరంలో రూ.17 లక్షలతో సిమెంట్ రోడ్డు, జీనేపల్లెలో రూ.11 లక్షలతో సిమెంట్‌రోడ్డు పనులు పూర్తయ్యాయి. అలాగే జీనేపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని వనికినిదిన్నెలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు పనులు రెండు రోజుల ముగించారు. కోటపాడు గ్రామ సచివాలయ పరిధిలోని కామినేనిపల్లెలో రూ.4 లక్షలతో సిమెంట్ రోడ్డు, శిరివెళ్లలోని 4వ సచివాలయ పరిధిలో రూ.15 లక్షలతో సిమెంట్ రోడ్డు, వీరారెడ్డి పల్లెలో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు పనుల అమోదానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

38 ఏళ్లకు కలిసిన ఆనందం



గోవిందపల్లెలో కలిసిన పూర్వ విద్యార్థులు

శిరివెళ్ల: ఒకే పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు కలిసి మెలిసి చదువుకున్నారు. 38 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వారందరూ అదే పాఠశాలలో కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. మండలంలోని గోవిందపల్లె, జిల్లా పరిషత్, హైస్కూల్లో ఆదివారం 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వారు నాటి జ్ఞాపకాలను, పాఠశాల తీరు, నేడు రూపురేఖలు మారడం చూసి ఆనందం వ్యక్తం చేశారు. సమ్మేళనంలో భాగంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువు వేమారెడ్డి, వీరారెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంకటేశ్వర్లను శాలువాలు కప్పి పూలమాలతో సన్మానించారు. నాటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ ఎప్పుడో చదువు చెప్పిన తమను విద్యార్థులు గుర్తు పెట్టుకొని సన్మానించడం అభినందించదగ్గ విషయమన్నారు. సమ్మేళనం ఆర్గనైజర్లు భాస్కరరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

ఉత్తమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీగా పాణ్యం



పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయలం

పాణ్యం: గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయి. ఏటా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని తొమ్మిది విభాగాల్లో ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి ఆయా జిల్లాల కలెక్టర్ల చేతుల మీదుగా అవార్డులను అందిస్తారు. పంచాయతీ తరఫున ప్రథమ పౌరుడిగా ఎన్నికైన సర్పంచ్‌కు అవార్డు అందిస్తారు. నంద్యాల జిల్లా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారిగా అవార్డులను ప్రకటించగా పాణ్యం గ్రామ పంచాయతీ ×సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో అవార్డుకు ఎంపికైంది. దీంతో నంద్యాల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ మేకల పల్లవి అవార్డు అందుకోనున్నారు. పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీలో 4,200 గృహాలు, 14 వేలకు పైగా జనాభా, 10,261 మంది ఓటర్లు ఉన్నారు. ఈ పంచాయతీలో అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వర్మీకంపోస్ట్ తయారీ యూనిట్‌లలో సఫిషియంట్‌గా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండడంతో పాటు నిర్వహణ సమర్థవంతంగా ఉండడంతో అధికారులు అవార్డుకు ఎంపిక చేశారు. పంచాయతీ అవార్డుకు ఎంపిక కావడంపై అధికారులు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు అవార్డుల ప్రదానం

ఆయా విభాగాల్లో ఎంపికైన గ్రామ పంచాయతీల సర్పంచ్, కార్యదర్శులకు సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డులను అందించనున్నారు. అలాగే దేశంలోని పంచాయతీల సర్పంచ్‌లతో ప్రధాని నరేంద్రమోదీ ప్రసంగించనున్నారు. ఈ ప్రసంగాన్ని అన్ని పంచాయతీల్లో లైవ్‌లో సర్పంచ్‌లు వీక్షించనున్నారు.

వివిధ విభాగాల్లో అవార్డులకు ఎంపికైన గ్రామ పంచాయతీలు

విభాగం పేరు	పంచాయతీ పేరు
1.ప్రాపర్టీ ఫ్రీఅండ్ ఎన్‌హాండ్స్ లైవ్ హుడ్ పంచాయతీలు	చాగలమర్రి, టారాపురం, ఎర్రగుంట్ల
2. హెల్తీ పంచాయతీ	హలహర్వి, మహదేవపురం, యూ.బొల్లవరం
3.చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ	గంగవరం, రామాపురం,ఎల్లమ్మగుంట తండా
4. వాటర్ సఫిషియంట్ పంచాయతీ	బ్రాహ్మణపల్లె, రామకృష్ణాపురం, ఐ.కొత్తపేట
5.క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ	బనగానపల్లె, పాండవగళ్లు, శిరివెళ్ల
6.సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీలు	మాంత్రికి, పాణ్యం, సంతనూరు
7. సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ	కానాల, మండగిరి, పలుకూరు
8. గుడ్ గవర్నెన్స్ పంచాయతీ	సిమెంట్ నగర్, ఆలమూరు, వీరుపాపురం
9. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ	బనగానపల్లె, మ్యాకడోనా, గుడుంబాయి తండా

అందరి సహకారంతోనే అవార్డు



అందరి సహకారంతో ఉత్తమ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా పాణ్యం గ్రామ పంచాయతీ ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఏ చిన్న సమస్య వచ్చినా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి రోజుల వ్యవధిలోనే పరిష్కారానికి కృషి చేస్తున్నాం. సిబ్బంది, అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతి ఇంటికీ ఆరోగ్యం, డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి, సురక్షిత మంచినీరు, వనరుల వినియోగం, వర్మీకంపోస్టు తయారీ కేంద్రం నిర్వహణ, పన్ను వసూళ్ల లక్ష్యం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించి గ్రామ పంచాయతీని ఆదర్శంగా తీర్చుదిద్దుతాం.

– మేకల పల్లవి, పాణ్యం, మేజర్ గ్రామ పంచాయతీ

యువకుడు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న వెంకటకృష్ణ

ఆళ్లగడ్డ: పట్టణంలోని సద్దాం కాలనీకి చెందిన వెంకటకృష్ణ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. నగేష్ కుమారుడు వెంకటకృష్ణ వాయిద్యం వాయిస్తూ హైదరాబాద్‌లో ఉండేవాడు. ఈ క్రమంలో ఈ మధ్య ఓ యువతితో పెళ్లి నిశ్చయమైంది. ఆ తర్వాత ఏమైందో తెలియదు కాని ఆదివారం మధ్యాహ్నం తండ్రి నగేష్, తల్లి సుజాతలు పనిమీద బయటకు వెళ్లడంతో వెంకటకృష్ణ ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో రజకులపై కొనసాగుతున్న దౌర్జన్యాలు, వివక్షత, లైంగిక వేధింపులు, గ్రామ బహిష్కరణలను ఆపాలంటే రజకులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆల్వకొండ మద్దిలేటి పిలుపునిచ్చారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ గంగమ్మ గుడి ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంత రం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీనివాసులు, వెంకటరమణ, విశ్వనగర్ రాము పాల్గొన్నారు.